# సాధ్వి

శ్రీమతి గండికోట సావిత్రీదేవిగారు

నేనిప్పుడు చెప్పబోయేవిషయం నేనుఎఱుగున్న ఒక శూద్రస్త్రీని గుఱించి. భర్త పెట్టెడిబాధలు నివర్తించుకొనుటకు వీలుండియు, మనపూర్వపుస్త్రీలచరిత్రలను విని వారి జీవితములే ఆదర్శములని నమ్మి అటులనే ప్రవర్తించి కష్టములనందిన కాంతనుగుఱించి.

మాయింట్లో రాముడని ఒకడు పనిచేస్తూఉండేవాడు. వాడికూతురు పైడి. పైడి అందమైనదీ, తెలివైనదీను. ఆమెకుచిన్నప్పుడే తల్లిపోవడంచేత రాముడూ, అదీ మాఇంట్లోనే ఉండేవారు. పైడికి పదవయేడురాగానే రాముడు తనుకూడాపోతే దానికి దిక్కుండదని ఆలోచించిపెళ్లిచేసేశాడు. పైడిరోజూ ఏదైనా మనపూర్వులవిషయాలుచెప్పమని అడుగుతూ ఉండేది. నాకుతోచినవి నేచెప్పేదాన్ని. ఏదైనాపేరువింటే ఆపేరుగల పూర్వులచరిత్రలు తెలుసుకుంటేగాని దానికితోచేదికాదు. ఆవిధంగా దమయంతి, చంద్రమతి, సీత, సావిత్రి, మొదలైన పతివ్రతలచరిత్రలన్నిటిని నన్నడిగి తెలుసుకుంది. వారినిగుఱించి నీఅభిప్రాయ మేమిటంటే ప్రతిహిందూస్త్రీ వారిలాగే ఉండాలని నాఅభిప్రాయమని చెప్పేది. కొంత కాలానికి రాముడుచనిపోయాడు. పైడి మాయింట్లోనే ఉండిపోయింది.

రాముడుపోయిన నెల్లాళ్లకి పైడిమొగుడు మాయింటికొచ్చి 'నాపెళ్లాం మీయింట్లో ఉండడానికివల్లకాదు తీసికెళ్లిపోతా'నన్నాడు. సరేననుకుని 'ఏమే? పైడీ! వెడతావుటే?' అని అడిగితే వాడిమొఖంవేపు నామొఖంవేపూచూసి వెళ్లిపోతానంది. వాడుతీసికెళ్లిపోయాడు.

ఏడాదిగడిచినతరువాత ఒకనాడు పైడి మాయింటికివచ్చి వాళ్లెళ్లినఊళ్లో ఏమీపని లేకపోవడంవల్ల ఈఊరువచ్చేశామనీ ఇక తను మాయింట్లోపనిచేస్తాననీ చెప్పింది. సరే ఉండమన్నా. పైడి మాయింట్లోపనిచేసేది. రోజులుగడిచినకొద్దీ పైడి చిక్కిపోతూ దీనంగా ఉండేది. ఏమేఅలాఉన్నావని ఎన్నిసార్లడిగినా చెప్పేదికాదు. ఇలాఉంటూండగా ఒకరోజు పైడి పనికి ఆలస్యంగా వచ్చింది. అది అంట్లు తోముతూంటే, నేను మామూలుగా పలక రిద్దామని వెళ్లిచూసేప్పటికి అంట్లు ఎడంచేత్తో తోముతోంది. కుడిచేతికి కట్టుకట్టుకుంది. కళ్లమ్మట నీళ్లుకారుతున్నాయి. నేను 'చేతికి కట్టేమిటి? ఏంజరిగింది? ఎందుకుఏడుస్తున్నావు?' అని ఎంతఅడిగినా చెప్పలేదు. అడగ్గా, అడగ్గా తేలిందిసంగతి. ఏమిటంటే పైడి మొగుడు పనిచేసితెచ్చిన డబ్బులతో తాగేసి, రోజూ పైడిని చావబాది ఇంకాఅది వాడికూడా సరిపోయే అన్నంతీసుకురాలేదని మళ్లీకొట్టేవాడుట. ఆరోజున ఆకొట్టడమేఎక్కువైంది. చేతి గాజులన్నీపగిలి చేతులోగుచ్చుకుపోయాయిట. ఆగాజుముక్కలన్నీ తీసుకుని తడిగుడ్డచుట్టుకుని పనికొచ్చింది. అప్పుడు దాన్ని ఆస్పత్రికిపంపి కట్టుకట్టించి, 'ఇంటికెడితే మళ్లీకొడతాడు, మాయింట్లోనే ఉండిపో'అని చెప్పేను. 'ఇక్కడుంటే కులంవాళ్లు ఆక్షేపిస్తారమ్మా, ఇంటికే వెడతాను' అనిచెప్పి వెళ్లిపోయింది.

అమర్నాటినుంచి పనికిరాలేదు. మళ్లా నెలరోజులైనతరువాత పనిచేస్తానని వచ్చింది. ఇన్నాళ్లూ ఎందుకురాలేదంటే ఏంచెప్పిందంటే, మేము కట్టుకట్టించిన తరువాత ఇంటికెడితే ఆకట్టుచూసి బ్రాహ్మలకి నామీాద నేరాలుచెపుతావా? అయినా బ్రాహ్మలకి నీమీాద అంత దయ ఎందుకుంటుంది? నిన్నెరుగున్నవాళ్లెవరో కట్టించిఉంటారు. ఇప్పటినుంచి నువ్వు పని మానెయ్యి. నువ్వుపేటల్లో కెడితే పనికిరావని మళ్లీ వాడి కసితీరా కొట్టేశాడుట. ఆదెబ్బలతో నాలుగురోజులవరకూ లేవలేకపోయిందట. పనిమానిపించేడుగాని ఇద్దరికీ ఇంట్లో అన్నంలేదు. చివరకి ఎలాగైతేనేం ఆకలికాగలేక పనిచెయ్యమనిపంపించేడు. మేము అన్నంపెడితే ఇంటికి పట్టికెళ్లేది. 'ఇంటికెందుకు? మాఇంట్లోనే తినేశెయ్యి' అనిచెపితే 'ఇంటికాడ ఆకలితోఉంటే ఎలాతిననమ్మా' అనిచెప్పి పట్టుకెళ్లేది. అన్నంతీసికెళ్లిపెడితే 'నువ్వుతినకుండానే నాకుపెడుతున్నావా? ఎవరోపెడితే బాగాతిని నాకొక్కొస్తఅన్నం పట్టుకొస్తున్నా'వని కొట్టేవాడుట. ఇలా ప్రతివిషయంలోనూ తప్పులెంచుతూ రోజూకొట్టకుండా ఉండేవాడుకాడుట.

'కడుపుకి అన్నంలేకుండా కట్టుకునేందుకు బట్టలేకుండా ఎన్నాళ్లుంటావు? మీాలో మారుమనువుందికదా ఇంకోణ్ణిపెళ్లిచేసుకోకూడదా' అని ఒకరోజుఅన్నాను. 'ఎందుకమ్మా కులంవాళ్లచేత మాటకాయాలి' అంది. 'నువ్విప్పుడు కష్టపడుతూఉంటే కులంవాళ్లు అన్నం పెట్టేరా? బట్టఇచ్చేరా? నీసుఖంచూసుకోవాలిగాని కులంవాళ్లంటారని ఎన్నాళ్లిలాకష్టపడతావు?' అంటే 'అవునమ్మా ఇంకోణ్ణిచేసుకుంటే వాడు వీడికన్నసుఖపెడతాడన్న నిశ్చయమేమిటి? వాడెలాంటివాడౌతాడో? అందుచేత ఇంకోణ్ణిచేసుకుంటే సుఖుండదు; పైగా మాటలుపడాలి. అంచేత ఇలాగేఉంటాను. బతికినరెండురోజులూ నలుగురిచేతా మాటలు పడితేనేం? ఇలాకష్టపడితేనేం? ఇప్పుడు ఇంట్లో వాళ్లండమేగాని పైవాళ్లు నన్నేమీాఅనరు గదా' అని 'ఇదివరకు భర్త ఎన్నికష్టాలుపెట్టినాపడాలి, ఎదురుచెప్పకూడదు, భర్తనేభగవంతుడిగా భావించాలని మీారేఅన్నారు కాదమ్మా' అంది. నిజమే నేనలా చెప్పినమాటనిజమే కాని అలా నడుచుకున్నందువల్ల పైడివిషయంలో మంచి కనపడలేదు. పాపము పైడి ఇంక సుఖపడేందుకు మార్గంకనపడలేదు. అలా ఎన్నాళ్లని ఉండగలదు?

ఒకనాడుతెల్లారేప్పటికి పైడిశవం ఊరిబయట నూతిలో తేలిఉంది. అదిచూసినవాళ్లంతా అదిశూద్రస్త్రీ అవడంవల్ల ఎక్కువదుర్మార్గురాలనీ, దాని చెడుపనులకు ప్రతిఫలంగా దైవము దానికి ఆచావుపెట్టేడనీ చెప్పుకున్నారు కాని నిజం ఆలోచించేవాళ్లెవరు? మేము దాన్నిగురించి చెడుమాటలువిన్నప్పుడు చాలావిచారించేం. అయితే ఇంతకూ భర్తకెదురాడకుండా, చెప్పినమాటలమీాదనే నడుచుకున్న స్త్రీపొందుతుందన్న కీర్తి, సుఖం పొందకుండా ఈవిధంగా జరిగిందెందుకు? దీనికేంకారణంఅనుకున్నా. పూర్వపుస్త్రీలు కష్టములు పొందలేదా? వారుకూడా చాలాకష్టాలనుభవించారే? వారుపడ్డకష్టాలు లెక్కకొచ్చేదెందుకు? అనుకుంటూంటే పైడి భర్త ఏలాంటివాడన్నసంగతి జ్ఞాపకంవచ్చింది.

709

పూర్వపుచరిత్రలలో సత్యవంతుడు, నలుడు, హరిశ్చంద్రుడు మొదలైనవారంతా ఏలాంటి వారు? వారుకూడ ఇప్పటి పురుషుల్లాంటివారే ఔతే పూర్వపు పతివ్రతామతల్లుల చరిత్రలు లెక్కకొచ్చునా? అవికూడ ఎక్కడో అణిగిపోయిఉండేవి. వారనుభవించిన కష్టములు భార్యాభర్తలుకలిసి. ఇప్పుడో భార్య, భర్తవలన. దీనికి దానికి తారతమ్యములేదా? అను కున్నా. పూర్వపుపతివ్రతలవలెనే హిందూస్త్రీలందరు నడుచుకొనవలసియున్నదో పూర్వపు పురుషులవలెనే ఇప్పటివారుకూడ నడుచుకొనవలదా?

# జోలపాటలు

## ౧

(సంపాదకురాలు) శ్రీమతి యస్. వి. సరళాదేవిగారు

పట్టుపావడగట్టి పప్పువడిగట్టి
పరుగెత్తుఅమ్మాయి! పరుగుచూదాము
అంచుపావడగట్టి అటుకులొడిగట్టి
ఆటాడుఅమ్మాయి! ఆటచూదాము.

చిక్కనుకాయల్లు తీగకందమ్మ
నినుగన్నతల్లికి బిడ్డలందమ్మ
చిక్కనుకాయల్లు మాడపై ప్రాలు
శ్రీరాము భ్రమఅంత సీతపై నుండు.

దోరాదిపండెఱుపు దొండపండెఱుపు
నిలుచున్నవారిలో నిమ్మపండెఱుపు
నిమ్మపండ్లొకచాయ నీలమొకచాయ
నిత్యానఅబ్బాయి దినమొక్కచాయ.

కాకినాడబాటలకు మీనాన్నపోగా
కంతానమెఱసింది కమలాలవలెకం
ఎందుకోననుకొంటి ఇట్టిపలకమ్మ
మాచిట్టితల్లికని తెలిసిపోయినది.

పుట్టుతూనే సీతబుద్ధులడిగినది;
ప్రేమతో కౌసల్యకోడలయినాది;
చక్కనిగుణములను గుట్టపోసినది;
లోకాభిరాముని చెట్టపట్టినది.

ఎటులగంటివమ్మ? యశోద! నీవు
ఇంతచక్కని చిన్నికృష్ణుని చెపుమ?
పచ్చిపిండితిని, పాలారగించి,
భాద్రపదపూర్ణిమ ఉంటినేచెలియా!

## ౨

(సంపాదకురాలు) శ్రీమతి పాకలచంద్రకాంతామణిగారు

చిన్నారిపొన్నారి చిలుకవేనీవు
బాగుగాపాడేటి భరతమేనీవు
బంగారువలెనున్న సింగారివీవు
చెక్కిళ్లుబోసిన చెంగావిప్రోవు.
నవ్వితే నీనోట నవరసాలొలుకు
పండువెన్నెలబోలు పటికంపుతళుకు

రవ్వసేయకుమమ్మ రజితంపుబొమ్మ
పవ్వళించుము జోలపాడెదనుమ్మ.
నిద్రపోనాయమ్మ నిద్రపోకొమ్మ
భద్రంబునీకగును పవళింపుకొమ్మ
హాయి,హాయి,హాయి, ఆపదలుగాయి
చిన్నదానినిగాయి శ్రీరంగశాయి!